ఆరోగ్య శిబిరాలకు.. అద్భుత స్పందన



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సందేష్



ప్రసాద్‌గార్డెన్స్ శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

- ప్రసాద్‌గార్డెన్స్ జగనన్న సురక్షకు జనం నీరాజనం
- వైద్యసేవలు, వైద్యుల పనితీరు భేష్ అని కితాబు

పేదల ఆరోగ్యం పట్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోంది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య పరీక్షలు చేసి.. వ్యాధులను నిర్ధారించి తగిన మందులు అందజేస్తోంది. మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ స్థాయి వైద్యం అందజేస్తోంది. ముఖ్యమంత్రి జగనన్న తమ పట్ల కనబరుస్తున్న శ్రద్ధ పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ ఆయన పాలనా తీరును కొనియాడుతున్నారు.

జగదాంబ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్షకు జనం నీరాజనం పడుతున్నారు. శుక్రవారం జీవీఎంసీ 35వ వార్డు ప్రసాద్‌గార్డెన్స్‌లోని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన వైద్య శిబిరానికి చక్కటి స్పందన లభించింది. ఇందులో ఉడ్‌యార్డు స్ట్రీట్ సచివాలయం పరిధి ప్రజలు పాల్గొన్నారు. శిబిరానికి హాజరైన వారికి వైద్య సిబ్బంది వివిధ రకాల పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మొత్తం శుక్రవారం నాటి శిబిరానికి 504 మంది హాజరయ్యారు. వారిలో 107 మందికి కంటి పరీక్షలు చేశారు. వ్యాధుల తీవ్రతను అనుసరించి పలువురిని కేజీహెచ్‌కు తరలించారు. నలుగురిని ఆరోగ్యశ్రీ చికిత్సకు ఎంపిక చేశారు.

వైద్యులకు మన్నన..

శిబిరానికి హాజరైన ప్రజలు వైద్య సిబ్బంది పనితీరు పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలు ఓపిగ్గా వినడమే కాకుండా చక్కగా వైద్యం చేస్తున్నారని ప్రజలంటున్నారు. ఈ శిబిరం వల్ల ఆరోగ్య భరోసా చిక్కిందని, ముఖ్యమంత్రి జగనన్న మంచి కార్యక్రమం నిర్వహిస్తున్నారని సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఎటువంటి ఖర్చు లేకుండా మెడికల్ క్యాంప్ ద్వారా రక్త పరీక్షలు, చర్మ సమస్యలు, జనరల్ చెకప్ వంటి ఏడు రకాల సేవలు అందిస్తుండడం ఎంతో మేలు చేస్తోందని జనం సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గృహసారథులు, కన్వీనర్లు, ఏఎన్‌ఎంలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

శిబిరాలతో సత్ఫలితాలు..



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ముందుగా చేపట్టిన సర్వే చికిత్స సమయంలో బాగా ఉపయోగపడింది. ముందు ఆరోగ్య కేంద్రాల్లో జరిగిన శిబిరాల కంటే ఇప్పుడు సచివాలయాల పరిధిలో జరుగుతున్న శిబిరాలు ఇటు ప్రజలకు.. అటు వైద్య బృందాలకు ఉపయోగకరంగా ఉన్నాయి. పరీక్షలు చేయడం, మందులివ్వడం చకచకా జరిగిపోతోంది.

–డాక్టర్ సందేష్, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం, ప్రసాద్‌గార్డెన్స్, 35వ వార్డు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- రూ. కోటీ 47 లక్షలతో అండర్ పాసేజ్ పనులకు శ్రీకారం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి. చిత్రంలో ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

సీతమ్మధార/డాబాగార్డెన్స్ : నియోజకవర్గం పరిధి 27,31,28 వార్డులకు సంబంధించి ఆశీలమెట్టలో రూ. కోటీ 47 లక్షలతో అండర్ పాసేజ్ పునరుద్ధరణ పనులకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌తో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండూ రెండు కళ్లుగా భావించి సీఎం జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ అండర్ పాసేజ్ పునరుద్ధరణ పనుల్లో భాగంగా లైటింగ్, రోడ్డు మరమ్మతులు, బీటీ రోడ్డు నిర్మాణం, థెర్మో ప్లాస్టిక్ పెయింటింగ్, స్టడ్స్ ఏర్పాటు, సింథటిక్ ఎనామిల్ పెయింటింగ్, మ్యూరల్ ఆర్ట్ పెయింటింగ్, స్పీడ్ బ్రేకర్లు, స్ప్రింగ్ పోల్స్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. పూర్ణామార్కెట్ రోడ్డు విస్తరణ, బస్టాప్‌ల ఆధునికీకరణ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జోన్–4 కమిషనర్ శివప్రసాద్, ఈఈ సంతోషికుమారి, డీఈఈ వెంకటేష్, ఏఈ పార్వతి, 27వ వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు, 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్, వార్డు అధ్యక్షుడు బాపూ ఆనంద్, క్లస్టర్ ఇన్‌చార్జి కోన శంకరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భారంగా మారే సంస్కరణలు తిరస్కరించాలి

డాబాగార్డెన్స్ : ప్రజలకు భారమయ్యే సంస్కరణలు తిరస్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు, సంస్కరణలను ప్రజలు ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, సంస్కరణలు, పట్టణ ప్రజలపై దుష్ప్రభావం అనే అంశంపై సీపీఎం రాష్ట్ర సదస్సు నిర్వహించింది. కార్యక్రమంలో పాల్గొన్న బాబూరావు మాట్లాడుతూ ఆదానీకి లాభం చేకూర్చేలా విద్యుత్ మీటర్లు బిగించి ప్రజల నడ్డి విరగ్గొట్టబోతున్నారని ఆరోపించారు. జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి. గంగారావు, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వేంకటేశ్వర్లు, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కార్యదర్శి ఎ. అజాశర్మ, ఆర్‌కేఎస్‌వీ కుమార్, బీఎల్ నారాయణ, గురప్ప తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన



దేవీ నవరాత్రుల నిర్వహణకు ఆర్థిక సహాయం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం జీవీఎంసీ 34వ వార్డు అచ్చియ్యమ్మపేటలోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కొబ్బరితోటలో విఘ్నేశ్వర యంగ్ ఫ్రెండ్స్ అసోసియేషన్‌కు దుర్గాదేవి మహోత్సవాల నిర్వహణకు రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం, దొడ్డి బాపూ ఆనంద్, క్లస్టర్ ఇన్‌చార్జి మాసిపోగు రాజు, లింగం శ్రీను, లండా రమణ, పచ్చిరిపల్లి రాము తదితరులు పాల్గొన్నారు. 36వ వార్డు జామియా మసీదు వద్ద ముస్లింల కోసం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం నిమిత్తం చర్యలు తీసుకున్నారు. రంగిరీజువీధిలో శ్రీ సత్యనారాయణస్వామి ఆలయ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని స్థానికులు వినతిపత్రం అందజేయటంతో ఆలయ అధికారులతో మాట్లాడారు. వార్డు అధ్యక్షులు, నగర కార్యదర్శులు ఆదివిష్ణు, సౌత్ మైనార్టీ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, బోణి దేవ, ఖాజావలి, దూడ అప్పారావు, శ్యామ్, వాసు, రామరాజు, అచ్యుత్, ధనరాజు, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షలు ప్రారంభం

అల్లిపురం : శరన్నవరాత్రులు పూర్తి కావటంతో నగరంలో అయ్యప్ప దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు శుక్రవారం టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన ధర్మశాస్త దేవాలయంలో తెల్లవారు జామున అయ్యప్ప మాలధారణ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఇప్పటికి 36 మార్లు అయ్యప్పమాల వేసి, స్వామి వారిని దర్శించుకున్న గురుస్వామి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నీలాపు వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 20 మంది అయ్యప్ప మాలధారణ చేసి దీక్ష తీసుకున్నారు. వారంతా 41 రోజుల పాటు దీక్షను కొనసాగించనున్నారు. ఈ సందర్భంగా గురుస్వామి రమణారెడ్డి మాట్లాడుతూ తాను ఇప్పటి వరకు 36 మార్లు శబరిమల వెళ్లి వచ్చినట్లు తెలిపారు. 37వ సారి ఈ ఏడాది కన్నెస్వామిగా మాలధారణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎంఆర్‌వో నాగేశ్వరరావు, జీవీఎంసీ సూపరింటెండెంట్ శాలివాహన శేఖర్ ఫణికుమార్, సుధీర్‌కుమార్, సంజీవరెడ్డి పాల్గొన్నారు. వీరంతా డిసెంబర్ 6న శబరిమాల యాత్రకు తరలి వెళ్లనున్నట్లు తెలిపారు.

మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీస్ జీవీఎంసీ కార్యవర్గం ఎన్నిక

డాబాగార్డెన్స్: ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా పీతల వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. జీవీఎంసీ సమావేశ మందిరంలో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డొప్పలపూడి ఈశ్వర్, ప్రధాన కార్యదర్శులు అప్పలరాజు, రవి, కోశాధికారి నాగేశ్వరరావు జిల్లా అధ్యక్షుడితో పాటు జీవీఎంసీ కార్యవర్గాన్ని ప్రకటించారు. అసోసియేషన్ జీవీఎంసీ అధ్యక్షుడిగా రమణ(ట్యాక్స్ కలెక్టర్), ప్రధాన కార్యదర్శిగా బిర్లంగి శంకరరావు, ఉపాధ్యక్షులుగా గణపతి, ఎల్లంనాయుడు, కృపానందం, కార్యదర్శిగా సయ్యద్ సుభాన్, నిర్వాహక కార్యదర్శిగా కిలాని అప్పారావు, కోశాధికారిగా వై.అప్పారావు ఎన్నికయ్యారు. మున్సిపల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ కృషి చేస్తుందని ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గం తెలిపింది. అధ్యక్షుడు రాజేష్, కోశాధికారి సన్ని, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసరావు, వీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గుమ్మడి నర్సింగరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు అడ్డూరి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే వాసుపల్లి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్ : ప్రజాదర్బార్‌లో వైద్య సాయం కోసం వచ్చిన అర్జీలపై ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ స్పందించారు. సొంత నిధుల నుంచి ఐదుగురికి రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఛాతీ క్యాన్సర్‌తో బాధపడుతున్న 35వ వార్డు పండావీధిలో నివసిస్తున్న పాలిక రమణమ్మకు మందుల ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు, నోట్యి క్యాన్సర్‌తో బాధపడుతున్న 33వ వార్డు బంగారమ్మమెట్టకు చెందిన చింతపల్లి వెంకట నాగేశ్వరరావుకు రూ. 5వేలు, వెన్నుపూసకు దెబ్బ తగిలి మంచానికే పరిమితమైన ఇదే వార్డు వేంకటేశ్వర మెట్టకు చెందిన సూరిశెట్టి మల్లేశ్వరరావుకు రూ.5 వేలు, ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న 29వ వార్డు పందిమెట్ట నివాసి, వైఎస్సార్‌సీపీ కార్యకర్త మజ్జి అప్పలరాజు, ప్రసూతి సమస్యతో బాధపడుతూ ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న అతని భార్య మజ్జి లక్ష్మిలకు చేయూత అందిస్తూ రూ.5 వేలు అందజేశారు. అలాగే వార్డు పరిధి బీఎస్‌ఎన్‌ఎల్ క్వార్టర్స్ వద్ద నివసిస్తున్న షేక్ అమీర్ ఇటీవల ప్రమాదానికి గురి కావడంతో కాలు విరిగిపోయింది. అతని కుటుంబ పోషణ కష్టంగా ఉన్న నేపథ్యంలో రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఆయా వార్డుల నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ సీపీకి వినతులు



గ్రీవెన్స్‌లో భాగంగా సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

దొండపర్తి : పోలీస్ సిబ్బంది సమస్యలు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. పోలీసుల సమస్యల పరిష్కారానికి సీపీ శుక్రవారం తన ఛాంబర్‌లో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 13 మంది సిబ్బంది తమ సమస్యలను వినతుల రూపంలో సీపీకి తెలిపారు. ఇందులో ప్రమోషన్లు, క్వార్టర్లు, విభజన సమయంలో అనకాపల్లికి వెళ్లిన ఆరుగురు సిబ్బందిని తిరిగి నగర పరిధిలోకి తీసుకురావాలని కోరుతూ సీపీకి వినతులు అందజేశారు.

ఆయుధాల ప్రదర్శన

దొండపర్తి: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం బ్యారెక్స్ ప్రాంతంలో ఉన్న ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో ఆయుధాల ప్రదర్శన (ఓపెన్ హౌస్) నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ప్రదర్శనను పరిశీలించారు. అనంతరం పోలీస్ వ్యవస్థ పనితీరు, పోలీసులు తమ దైనందిన విధుల్లో వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, పరికరాలు, డాగ్ స్క్వాడ్, బాంబ్ డిటెక్షన్ స్క్వాడ్, కమ్యూనికేషన్, ఫింగర్ ప్రింట్స్, క్లూస్ టీంల ప్రదర్శనలను కళాశాలలు, పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.5 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3 వేలు, తృతీయ బహుమతిగా రూ.2 వేలు అందించనున్నారు. డీసీపీ–1 కె.శ్రీనివాసరావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఏడీసీపీ, ఏసీపీలు, ఆర్‌ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యువకుడిపై హత్యాయత్నం



ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటున్న అనిల్‌కుమార్, సాగర్‌రెడ్డి

అల్లిపురం : బారులో యువకునిపై మరో యువకుడు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేంకటేశ్వర మెట్ట ప్రాంతానికి చెందిన అనిల్‌కుమార్ (28) గోకుల్ థియేటర్ దరి మౌర్య హోటల్లో రిసెప్షనిస్ట్‌గా పని చేస్తున్నాడు. అతనికి అమ్మవారివీధికి చెందిన సాగర్‌రెడ్డి అలియాస్ మచ్చుడుతో గత ఆరు సంవత్సరాలుగా పరిచయం ఉంది. బుధవారం మధ్యాహ్నం సాగర్‌రెడ్డి అలియాస్ మచ్చుడు అనిల్‌కుమార్‌కు ఫోన్ చేసి డాబాగార్డెన్స్‌లో గల బార్‌కు రమ్మని చెప్పాడు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో అనిల్‌కుమార్ బార్‌కు వెళ్లాడు. అప్పటికే మరో ఇద్దరితో కలిసి సాగర్‌రెడ్డి అక్కడ మందు తాగుతూ కనిపించాడు. అనిల్‌కుమార్ వారితో కలిశాడు. ఈ నేపథ్యంలో సాగర్‌రెడ్డితో మాటామాట పెరిగి ఇద్దరి మధ్య తోపులాట జరిగింది. సాగర్‌రెడ్డి బీర్ బాటిల్‌తో అనిల్‌కుమార్ ఛాతీ, ఎడమ బుజంపై పొడిచి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. గాయపడిన అనిల్‌కుమార్‌ను ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు. హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక సాధికార బస్సు యాత్రకు ఏర్పాట్లు



బహిరంగ సభ ప్రదేశాన్ని భీమిలి సీఐ రమేష్‌తో కలిసి పరిశీలిస్తున్న ఏసీపీ శివరామిరెడ్డి

తగరపువలస: వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా శనివారం మధ్యాహ్నం చిట్టివలస బంతాట మైదానంలో బహిరంగ సభ జరగనుంది. ఈ యాత్రలో భాగంగా ఎండాడలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రులు, ఇతర మంత్రులు మీడియా సమావేశంలో పాల్గొననున్నారు. అనంతరం యాత్రలో పాల్గొన్న మంత్రుల బృందం చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు బోయిపాలెం కూడలి నుంచి ద్విచక్ర వాహనాల ర్యాలీ ప్రారంభమై తగరపువలస వరకు సాగుతుంది. చివరగా చిట్టివలస బంతాట మైదానంలో మధ్యాహం 3 గంటలకు జరిగే బహిరంగ సభకు జీవీఎంసీ, భీమిలి నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కానున్నారు. వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికారత బస్సు యాత్ర విజయవంతానికి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా సమావేశాలు నిర్వహించారు.

సరకు రవాణాలో ఆర్టీసీ ముందడుగు

డాబాగార్డెన్స్: ఏపీఎస్ ఆర్టీసీ సరకు రవాణాలో మరో ముందడుగు వేసింది. సరకు రవాణాకు సంబంధించి డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవ పోస్టర్‌ను శుక్రవారం కార్గో పార్శిల్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పలువురు అధికారులతో కలిసి జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అతి తక్కువ చార్జీలతో డోర్ డెలివరీ చేస్తున్నట్టు తెలిపారు. రూ.కేజీ వరకు రూ.18, కేజీ నుంచి 6 కేజీల వరకు రూ.30, 6 కేజీల నుంచి 10 కేజీల వరకు రూ.36, 10 కేజీల నుంచి 25 కేజీల వరకు రూ.48, 25 కేజీల నుంచి 50 కేజీల వరకు రూ.59లకే పార్సిల్, కొరియర్ డోర్ డెలివరీ సదుపాయం కల్పిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవికుమార్, ఆర్టీసీ అధికారులు అప్పలనాయుడు, వెంకట్రావు, పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్‌లో స్వచ్ఛభారత్

మహారాణిపేట : విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఎంపెడ, రాష్ట్ర మర పడవల సంఘం, మత్స్యశాఖ సంయుక్త నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో అనేక మంది పాల్గొన్నారు. ఎంపెడా అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్ నాయక్, ఆంధ్రప్రదేశ్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వాసుపల్లి జానకిరామ్ సంయుక్త ఆధ్వర్యంలో హార్బర్‌లో పలు ప్రాంతాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎంపెడా అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్ నాయక్ మాట్లాడుతూ విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి మత్స్య ఉత్పత్తులు విదేశాలకు ఎక్కువగా ఎగుమతి దృష్ట్యా మెరుగైన వాతావరణం, పరిసరాల పరిశుభ్రత ఉండాలన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ మాట్లాడుతూ విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టడం వల్ల చేపల కొనుగోలు కేంద్రం శుభ్రంగా ఉంటుందన్నారు. విశాఖ జిల్లా ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ విజయ, ఫిషింగ్ బోట్ యజమానులు, విశాఖ పోర్ట్ అథారిటీ, పోలీస్ డిపార్టుమెంట్, జీవీఎంసీ సిబ్బంది స్వచ్ఛందంగా పరిశుభ్రతలో పాల్గొన్నారు. నెట్‌ఫిష్ స్టేట్ కోఆర్డినేటర్ హనుమంతరావు, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు, కోశాధికారి మైలపల్లి నరసింహులు, ఉపాధ్యక్షుడు గుంటు దానయ్య, దూడ పోలయ్య, గనగళ్ల పోతయ్య తదితరులు పాల్గొన్నారు.

మూతపడనున్న దేవాలయాలు

డాబాగార్డెన్స్ : చంద్రగ్రహణం సందర్భంగా నగరంలో గల దేవాలయాలు మూతపడనున్నాయి. బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఆదివారం ఉదయం 7 గంటల వరకు అమ్మవారి దర్శనాలు నిలిపివేయనున్నట్టు ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు తెలిపారు. జగదాంబ జంక్షన్ మహారాణిపేటలో గల కనకమహాలక్ష్మి దత్తత దేవాలయం అంబికాబాగ్ రామాలయంలో స్వామి అర్చన, నివేదనలు, దర్శనాలు జరిపిన అనంతరం మధ్యాహ్నం 1 గంటకు ఆలయాన్ని మూసివేయనున్నారు. పాక్షిక చంద్రగ్రహణం నేపథ్యంలో ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం రాత్రి 7 గంటలకు కవాట బంధనం (తలుపులు మూసివేసి) చేయనున్నారు. 29 ఉదయం సంప్రోక్షణ అనంతరం సర్వదర్శనాలు ఉంటాయని ఆలయ ఈవో బుద్ధా మహాలక్ష్మి నగేష్, ప్రధాన అర్చకుడు ఫణిహారం నరసింహమూర్తి తెలిపారు.

కొనసాగుతున్న ధర్మప్రచార వారోత్సవాలు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారి ఆలయంలో ధర్మప్రచార వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో జి.వి.రమాబాయి ఆధ్వర్యంలో అర్చకులు శ్రీనివాస్ నేతృత్వంలో పూజలు నిర్వహించారు. సాయంత్రం వేంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ప్రతినిధి సునీత సారథ్యంలో జరిగిన కోలాటం భక్తులకు కనువిందు చేసింది.

గజలక్ష్మికి కవచధారణ..

డాబాగార్డెన్స్ : టౌన్‌కొత్తరోడ్డులో వెలసిన జగన్నాథస్వామి ఆలయంలో వేంచేసిన గజలక్ష్మికి కవచధారణ, సువర్ణ పుష్పార్చన శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా జర్మనీలో ఉంటున్న వెంకటరమణ, చందన దంపతుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ మారోజు శ్రీనివాసరావు, పలువురు ధర్మకర్తల చేతుల మీదుగా సువర్ణ పుష్పార్చన జరిపారు. ఆలయ ఈవో టి. రాజగోపాల్‌రెడ్డి, చైర్మన్ మారోజు శ్రీనివాసరావు, ధర్మకర్తలు కంటుముచ్చు సాగర్, వాకాడ రాధ, సూరిని రాము, ఉదయ బస్వంత్ యాదవ్, కొండా జ్యోతి పాల్గొన్నారు.